ఆర్టీసీ బోనులో కోడి

మరిచిపోయారో.. కావాలని వదిలేశారో? గానీ ఓ కోడిపెట్ట ఆర్టీసీ బస్సులో దొరికింది. కరీంనగర్ డిపో-2కు చెందిన బస్సు మంగళవారం మధ్యాహ్నం కరీంనగర్ బస్‌స్టేషన్ చేరుకున్నది. ప్రయాణికులు దిగిపోయారు. తర్వాత రోజు తనిఖీలో భాగంగా సెక్యూరిటీ సిబ్బంది ఆ బస్సును పరిశీలించగా, ఓ సంచిలో కోడి లభించింది. – కరీంనగర్ తెలంగాణచౌక్

ఏసీబీకి చిక్కిన కడెం తహసీల్దార్, డీటీ

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు

కడెం/బెల్లంపల్లిరూరల్, జనవరి 10: రైతు నుంచి లంచం తీసుకుంటూ నిర్మల్ జిల్లా కడెం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ బుధవారం ఏసీబీకి పట్టుబడ్డారు. కొత్తమద్దిపడగకు చెందిన లసెట్టి రాజన్న తన పెద్దనాన్న పేరు మీద ఉన్న 35 గుంటల భూమిని తన తమ్ముడు లసెట్టి సురేశ్ పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలని దరఖాస్తు చేసుకోగా రూ.15 వేలు డిమాండ్ చేశారు. బుధవారం డీటీ చిన్నయ్యకు రూ.9 వేలు లంచం ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

బెల్లంపల్లిలో పంచాయతీరాజ్ ఏఈ, కార్యదర్శి

లంచం తీసుకుంటూ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పంచాయతీరాజ్ ఏఈ పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరబాబు బుధవారం ఏసీబీ అధికారులకు దొరికారు. కాంట్రాక్టర్ రామగోని అశోక్‌గౌడ్ పెర్కపల్లిలో రూ.1.50 లక్షలతో క్రీడాప్రాంగణానికి మట్టి పనులు చేపట్టారు. బిల్లు కోసం మెజర్‌మెంట్ బుక్ చేయడానికి ఏఈతోపాటు పంచాయతీ కార్యదర్శి కాంట్రాక్టర్‌ను రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. బుధవారం బెల్లంపల్లిలో కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏఈ పరంజ్యోతి, కార్యదర్శి కే వీరబాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

మనోహర్‌రావు సస్పెన్షన్‌పై 3 వారాల్లోగా విచారణ

- **రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, జనవరి 10(నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా మంత్రితో కలిసి తిరుమలకు వెళ్లారన్న అభియోగాలతో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ బోయినపల్లి మనోహర్‌రావును సస్పెండ్ చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన ఉత్తర్వులపై 3 వారాల్లోగా విచారణ పూర్తి చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సస్పెన్షన్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మనోహర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది.

విదేశీ పర్యటనల వివరాలివ్వండి

- **చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వ రద్దు వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఆయన ద్వంద్వ పౌరసత్వాన్ని కలిగి ఉన్నారని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ రమేశ్ పౌరసత్వాన్ని చట్టవిరుద్ధంగా రద్దు చేశారని వాదించారు. దీంతో గత ఏడాది కాలంలో రమేశ్ జరిపిన విదేశీ పర్యటనల వివరాలను అందజేయాలని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ఆదేశించారు. పాస్‌పోర్టులు సరెండర్ చేసిందీ లేనిదీ కూడా చెప్పాలని పేర్కొంటూ.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

మధురై కోర్టుకు కౌశిక్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి

కాంగ్రెస్ నేత మాణిక్కమ్ ఠాగూర్ వేసిన పరువు నష్టం కేసులో..

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): పీసీసీ మాజీ ఇంచార్జి మాణిక్కమ్ ఠాగూర్ వేసిన పరువు నష్టం కేసులో బీఆర్‌ఎస్‌కు చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బుధవారం మధురై కోర్టుకు హాజరయ్యారు. వీరు కోర్టుకు హాజరైన ఫొటోను మాణిక్కమ్ ఠాకూర్ తన ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్‌లో పోస్టుచేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకమైన సందర్భంగా కౌశిక్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలపై మాణిక్కమ్ ఠాకూర్ మధురై కోర్టులో పరువు నష్టందావా వేశారు.

ప్రభుత్వ నిర్ణయం పర్యావరణానికి ముప్పు

- **హైకోర్టుకు వర్సిటీ భూములు కేటాయించడంపై వ్యతిరేకత**
- **విద్యార్థుల నిరసన.. పర్యావరణవేత్తల ఆవేదన**
- **అరుదైన వృక్షాలు, పక్షులు అంతరిస్తాయని ఆందోళన**
- **జీవో 55ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఖైరతాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో/వ్యవసాయ యూనివర్సిటీ జనవరి 10 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టు భవనాల నిర్మాణానికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అటు విద్యార్థి సంఘాలు, ఇటు పర్యావరణవేత్తల నుంచి వ్యతిరేకత వస్తున్నది. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నది. జీవో 55ను రద్దు చేసే వరకూ ఉద్యమిస్తామని మరో విద్యార్థి సంఘం హెచ్చరించింది. మరోవైపు యూనివర్సిటీ పరిధిలో జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేసిన పర్యావరణ సంస్థలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

జీవవైవిధ్యానికి ముప్పు

వ్యవసాయ పరిశోధనలకు నిలయంగా ఉన్న యూనివర్సిటీ భూములలో నిర్మాణాలు చేపట్టడం వల్ల అరుదైన వృక్ష జాతులు, జీవజాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అగ్రి బయోడైవర్సిటీ పార్క్‌లో జీవ వైవిధ్యానికి పెను ప్రమాదం ఏర్పడుతుందని పర్యావరణవేత్తలు పేర్కొన్నారు. మాజీ సీఎం రోశయ్య హయాంలోనే రాజేంద్రనగర్‌లోని అగ్రి యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్మించిన అగ్రి బయోడైవర్సిటీ పార్కును ప్రారంభించారు. అప్పటినుంచి వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఈ ప్రాంతంలో పరిశోధనలు, అధ్యయనాలతోపాటు, జీవ వైవిధ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చారు. ఈ క్రమంలో ఎంతో అరుదైన జంతు, వృక్ష, జీవ సంపదకు నిలయంగా మారిన పార్కును పరిరక్షించుకోవాలని పర్యావరణవేత్తలు పిలుపునిస్తున్నారు. గడిచిన కొంత కాలంగా ఈ పార్కును అభివృద్ధి చేయడంతోపాటు, ఇక్కడి జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేసిన సంస్థలన్నీ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

అరుదైన వృక్షాలు, పక్షులు

యూనివర్సిటీలో 350కి పైగా పక్షులు, జంతుజాతులు, 450కిపైగా వృక్షజాతులు, 80 ఔషధ మొక్కలు, 30 తీగజాతులతో జీవవైవిధ్యం విరాజిల్లుతున్నదని పర్యావరణవేత్తలు పేర్కొన్నారు. వాటన్నింటినీ రక్షిస్తూ బయోడైవర్సిటీ పార్కుగా అభివృద్ధి చేయడంలో 25 ఏండ్ల కృషి ఉందని అన్నారు. భారతదేశంలో అంతరించిపోతున్న ఐదు అరుదైన జాతుల్లో నాలుగు జాతులు ఇక్కడే ఉన్నాయని, సుమారు రెండు లక్షల చెట్లు ఉన్నాయని, ఒక్కో చెట్టు విలువ జీవితకాలం ఇచ్చే ఎకనామిక్ బెనిఫిట్ 35 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌కు ఊపిరితిత్తులు అంటారని, ఇక్కడ వృక్ష సంపద వల్ల హైదరాబాద్, రాజేంద్రనగర్ ఉష్ణోగ్రతల్లో ఎంతో వ్యత్యాసం ఉంటుందని చెప్పారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ సీఎంగా ఉన్న రోశయ్య చేతుల మీదుగా ప్రారంభించిన ప్రేమావతిపేట్‌లోని అగ్రి బయోడైవర్సిటీ పార్కు.. అదే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మరోసారి చేతులు మారుతున్నది. ప్రకృతికి నిలయంగా ఉన్న పదుల ఎకరాల భూముల్లో నిర్మాణ పనులు చేపడితే జంతుజాలం ఆవాసం కోల్పోయే ప్రమాదం ఉందని ఇన్నాళ్లు వ్యవసాయ పంటలతోపాటు, అరుదైన వృక్ష సంపదకు కృషి చేసిన వ్యవసాయ, పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరుదైన అతిచిన్న వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని చెప్తున్నారు.

వర్సిటీల జోలికొస్తే ఊరుకోం: ఏబీవీపీ

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని.. నెల రోజుల్లోనే తన బుద్ధిని బయటపెట్టిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

మూడో రోజుకు చేరిన విద్యార్థుల నిరసనలు

వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని, జీవో 55ను విరమించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని విద్యార్థులు ప్రతినబూనారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరసనలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. రోజంతా తరగతులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఉదయం నుంచే వర్సిటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర ఉద్యోగులు విద్యార్థులకు మద్దతుగా నిరసనల్లో పాల్గొంటున్నారు. యూనివర్సిటీ పరిధిలో హైకోర్టు నిర్మించడం వల్ల పర్యావరణం, వ్యవసాయ పరిశోధనలు, తదితర రంగాలకు అపార నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కుటుంబం నుంచి వచ్చినట్టు చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డికి వ్యవసాయ యూనివర్సిటీ విలువ తెలియకపోవడం విడ్డూరమని మండిపడ్డారు. నిరసనలో విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీషా, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిట్స్ వీసీకి వీఎల్‌ఎస్‌ఐ జీవనసాఫల్య పురస్కారం

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యక్తి, బిట్స్ పిలానీ వీసీ రాంగోపాల్‌రావు ప్రతిష్ఠాత్మక వీఎల్‌ఎస్‌ఐ జీవన సాఫల్య – 2024 అవార్డును అందుకొన్నారు. బుధవారం కోల్‌కతాలో జరిగిన 37వ వీఎల్‌ఎస్‌ఐ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. గతంలో రాంగోపాల్‌రావు ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు.

‘కాళేశ్వరం’పై రెండో రోజూ తనిఖీలు

- **కన్నెపల్లి పంప్‌హౌస్ కార్యాలయం సీజ్**
- **కన్నెపల్లి, మేడిగడ్డ రికార్డులు స్వాధీనం**
- **మహదేవపూర్ ఇరిగేషన్ ఆఫీసులో కొనసాగుతున్న విచారణ**

జయశంకర్ భూపాలపల్లి (నమస్తే తెలంగాణ)/మహదేవపూర్, జనవరి10: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండో రోజు బుధవారం తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఉదయం 10 గంటలకు మహదేవపూర్ ఇరిగేషన్ డివిజనల్ కార్యాలయంలో మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్‌కు సంబంధించిన రికార్డుల తనిఖీని ప్రారంభించారు. ప్రభుత్వం ఆదేశించిన 46 అంశాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ముఖ్యంగా డీపీఆర్ అండ్ సీడబ్ల్యూసీ క్లియరెన్స్, సీడబ్ల్యూసీ ఇచ్చిన పంప్ హౌస్, బరాజ్‌ల డ్రాయింగ్, డిజైన్ వివరాలు, ఇన్వెస్టిగేషన్ అండ్ సర్వే వివరాలు తేదీల వారీగా, పంప్‌హౌస్ అండ్ బరాజ్‌ల ఫౌండేషన్ ఎక్స్‌ప్లోరేషన్ వివరాలు, సీఈ, సీడీవో అప్రూవల్ డిజైన్ అండ్ డ్రాయింగ్, ఎస్టిమేట్ అండ్ అప్రూవల్ వివరాలు, అగ్రిమెంట్ కాపీ, బ్యాంకు గ్యారెంటీస్, సప్లిమెంటల్ అగ్రిమెంట్, మేడిగడ్డ నేషనల్ డ్యాం సేఫ్టీ రిపోర్టుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

రామగుండం ఎన్టీపీసీలో సోదాలు

జ్యోతినగర్/తిమ్మాపూర్: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలోని మూడు ఇరిగేషన్ ఆఫీసులు, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ఎస్సారెస్పీ క్వార్టర్లలోని ఈఎన్సీ క్యాంప్ ఆఫీసులో రెండో రోజూ విజిలెన్స్ సోదాలు కొనసాగాయి. రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఏఎస్పీ బాలకోటయ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో మూడు బృందాలు సోదాలు చేపట్టాయి. భీమునిపట్నం చిలుకలయ్యగుడి ఏరియాలోని నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలో మరో బృందం నిర్వహించిన సోదాలు బుధవారం సాయంత్రం ముగిశాయి. కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను సీజ్ చేసి తరలించారు. కాగా కృష్ణానగర్‌లోని ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ కార్యాలయంలో మూడో బృందం జరుపుతున్న సోదాలు బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. ఇక్కడ విజిలెన్స్ డీఎస్పీ కమలాకర్‌రెడ్డి, ఏఈ, డీఈ ఉన్నారు. కరీంనగర్ జిల్లా తి మ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న పత్రాలు, డేటాను సేకరించారు.

శ్రీనగర్ ఎన్‌ఐటీ డైరెక్టర్‌గా రవీంద్రనాథ్



హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): జమ్ముకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ రవీంద్రనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన జమ్ముకశ్మీర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్‌కు వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్‌ఐటీకి డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ సుధాకర్ పదవి నుంచి వైదొలగడంతో.. రవీంద్రనాథ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించే వరకు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. రవీంద్రనాథ్ గతంలో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు.

అప్పుల ఊబిలో.. రాజస్థాన్ విద్యుత్తు సంస్థలు

గత కాంగ్రెస్ హయాంలో 90 వేల కోట్ల రుణాలు | **బడ్జెట్‌లో మెజారిటీ వాటా ఇకపై మిత్తిలకే** | **రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ ఆందోళన** | **కరెంటు సరఫరాపైనా తప్పుడు లెక్కలు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ‘తప్పులెన్నువారు..’ అంటూ వేమన చెప్పినట్టే ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి. తాము మొన్నటివరకూ పాలన చేసిన రాజస్థాన్‌లో విద్యుత్తు సంస్థలను అప్పులపాల్జేసి అక్కడ చీకట్లను మిగిల్చిన హస్తంపార్టీ.. తెలంగాణలో 24 గంటల నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసిన బీఆర్‌ఎస్‌పై లేనిపోని నిందలు వేస్తున్నది. రాజస్థాన్‌లో ఐదేండ్ల కాంగ్రెస్ పాలనే దీనికి నిదర్శనం



అప్పుల కుప్ప

రాజస్థాన్‌లోని విద్యుత్తు కంపెనీలకు రూ. 90 వేల కోట్ల అప్పులు ఉన్నట్టు ఆ రాష్ట్ర సీఎం భజన్‌లాల్ శర్మ తెలిపారు. ఈ రుణాలను తీర్చడానికి, మిత్తిలు కట్టడానికే బడ్జెట్‌లో మెజారిటీ వాటాను కేటాయించాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్తు శాఖ పనితీరుపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని కోతలు లేని కరెంటు సరఫరాకు రోడ్డు మ్యాప్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలకు చెక్ పెట్టాలంటే పునరుత్పాదక శక్తి వనరుల వైపు దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

ట్రిక్కులు మానుకోవాలి

తక్కువ ధరకే ప్రజలందరికీ నాణ్యమైన నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. యాసంగి సీజన్ (రబీ సీజన్) రైతులకు ముఖ్యమైనదని, వారికి కూడా తగినంత విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేయాలని ఆదేశించారు. గత ఆగస్టులో రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన విద్యుత్తు కోతలు విధించడం తెలిసిందే. దీంతో సామాన్యులు, రైతులు, పారిశ్రామికవర్గాలు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. అయితే, తమ ప్రభుత్వం కోతలకు పాల్పడలేదని అప్పటి సీఎం అశోక్ గెహ్లాట్, విద్యుత్తు శాఖాధికారులు మోసపుచ్చే ప్రయత్నం చేశారు. దీనిపై తాజాగా స్పందించిన సీఎం భజన్‌లాల్.. విద్యుత్తు సరఫరాకు సంబంధించి వాస్తవ సమాచారాన్ని ఇవ్వాలన్నారు. విద్యుత్తు లెక్కలను తారుమారు చేసే ట్రిక్కులను మానుకోవాలని అధికారులకు హితవు పలికారు.

రాజస్థాన్ దెబ్బకు కశ్మీర్‌లో కటిక చీకట్లు

- **12- 16 గంటలపాటు కోతలు**
- **గడిచిన 20 ఏండ్లలో ఎన్నడూ చూడని విద్యుత్తు సంక్షోభం**
- **రాజస్థాన్ ప్రభుత్వంతో గత కరెంటు ఒప్పందం వల్లే**
- **మళ్లీ మరో డీల్.. ప్రతిపక్షాల ఫైర్**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): భూలోక స్వర్గంగా చెప్పుకొనే కశ్మీర్‌లో విద్యుత్తు సంక్షోభం నెలకొన్నది. రోజుకు 12–16 గంటల పాటు పవర్ కట్స్ ఉంటున్నట్టు స్థానికులు వాపోతున్నారు. గడిచిన రెండు దశాబ్దాల్లో ఈ స్థాయి కరెంటు సంక్షోభాన్ని ఎన్నడూ చూడలేదని చెబుతున్నారు. 70 లక్షల మంది జనాభా ఉన్న కశ్మీర్‌లో విద్యుత్తు డిమాండ్ 1800 మెగావాట్లుగా ఉంటుంది. ఈ చలికాలం విద్యుదుత్పత్తి 50–100 మెగావాట్లు దాటలేదని అధికారులు చెబుతున్నారు. అయితే, రాజస్థాన్ తదితర రాష్ట్రాలతో గతంలో చేసుకొన్న ఒప్పందాల మేరకు విద్యుత్తును ఆయా ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని హక్కుల కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఈ వివాదం కొనసాగుతుండగానే.. కశ్మీర్‌లోని రాతల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌పీసీఎల్), జమ్ముకశ్మీర్ యంత్రాంగం.. రాజస్థాన్ ప్రభుత్వంతో మరో విద్యుత్తు సరఫరా ఒప్పందాన్ని చేసుకొన్నది. జనవరి 3న చేసుకొన్న ఈ డీల్ ప్రకారం.. రాజస్థాన్‌కు ఆర్‌హెచ్‌పీసీఎల్ వచ్చే 40 ఏండ్లపాటు విద్యుత్తును సరఫరా చేయాల్సి ఉంటుంది. దీనిపై అక్కడి విపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. అసలే విద్యుత్తు కోతలతో కశ్మీరీ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఇలాంటి ఒప్పందాలు చేసుకోవడమేంటని అధికార యంత్రాంగాన్ని నిలదీస్తున్నాయి.

దగ్గు మందు ఓవర్‌డోస్ ఇచ్చి హత్య?

- **ముందస్తు ప్రణాళికతోనే కుమారుడిని చంపిన సీఈవో**

పనాజీ, జనవరి 10: గోవాలో కన్నతల్లే నాలుగేండ్ల కుమారుడిని హత్య చేసిన కేసులో హత్యకు గల కారణాలపై పోలీసులు పూర్తి నిర్ధారణకు రాలేకపోతున్నారు. అయితే తన కుమారుడికి దగ్గుమందు అధిక మోతాదులో పట్టించి, తర్వాత ఊపిరాడకుండా చేసి హతమార్చి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. స్టార్టప్ కంపెనీ సీఈవో అయిన సుచనా సేఠ్ (39) గోవాలో తన కుమారుడిని చంపి మృతదేహాన్ని పెద్ద బ్యాగ్‌లో పెట్టి క్యాబ్‌లో బెంగళూరులో వెళుతుండగా కర్ణాటక రాష్ట్రంలో పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన హత్యేనని పోలీసులు స్పష్టం చేశారు. అయితే తాను ఈ హత్య చేసినట్టు నిందితురాలు అంగీకరించ లేదు. తాను లేచేటప్పటికే తన కుమారుడు మృతి చెంది ఉన్నాడని ఆమె పోలీసులకు తెలిపింది. అయితే ఆమె చెప్పే మాటలను తాము విశ్వసించడం లేదని, భర్తతో విభేదాల కారణంగానే ఆమె ఈ హత్యకు పాల్పడి ఉంటుందని ప్రాథమికంగా అనుమానిస్తున్నట్టు ఒక పోలీస్ ఉన్నతాధికారి చెప్పారు. దీంతో ఆమెను పనాజీ సమీపంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ అండ్ హ్యూమన్ బిహేవియర్‌కు తీసుకెళ్లి మానసిక వైద్య పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. గోవాలో ఆమె బసచేసిన అపార్ట్‌మెంట్‌లో రెండు ఖాళీ దగ్గు మందు సీసాలను పోలీసులు కనుగొన్నారు.

బుర్జ్ ఖలీఫాను మించిన భవనం

- **సౌదీ అరేబియాలో 1000 మీటర్ల ఎత్తుతో ‘జెడ్డా టవర్స్’!**

రియాద్, జనవరి 10: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం.. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాకు పోటీగా సౌదీ అరేబియాలో మరో భవనం నిర్మాణం జరుపుకుంటున్నది. ప్రపంచం అబ్బురపడేలా అత్యంత ఎత్తైన, ఆకర్షణీయమైన కొత్త భవనాన్ని 1.23 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ.10వేల కోట్లు) ఖర్చు చేసి ‘జెడ్డా ఎకనమిక్ కంపెనీ’ నిర్మిస్తున్నది. ‘జెడ్డా టవర్స్’గా పిలుస్తున్న ఈ భవనం ఎత్తు 1000 మీటర్లు ఉంటుందని తెలిసింది. అంటే భూమి నుంచి ఆకాశంలో ఒక కిలోమీటరు ఎత్తు అన్నమాట. దుబాయ్ నడిబొడ్డున 2010లో నిర్మించిన బుర్జ్ ఖలీఫా ఎత్తు 828 మీటర్లు. ఇది గత 14 ఏండ్లుగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనంగా కొనసాగుతున్నది. ప్రపంచ పర్యాటకానికి, వ్యాపారానికి, సంపదకు దుబాయ్‌ను కేంద్రంగా మార్చటంలో ఈ భవనం కీలకంగా మారింది.

కేంద్ర దర్యాప్తు సంస్థలకు సమాచారం ఇవ్వొద్దు

- **సొంతంగా ఏ పత్రాలూ అందించొద్దు**
- **శాఖలకు జార్ఖండ్ ప్రభుత్వం లేఖ**



రాంచీ, జనవరి 10: మనీలాండరింగ్ కేసులో ఈడీ జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్‌కు వరుసగా పలుమార్లు సమన్లు జారీచేయడం.. విచారణకు ఆయన గైర్హాజరు అవుతూ వస్తున్న క్రమంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు కీలక ఆదేశాలు జారీచేసింది. ముందస్తు అనుమతి లేకుండా కేంద్ర దర్యాప్తు సంస్థల నోటీసులు, అభ్యర్థనలకు స్పందించొద్దని, డైరెక్ట్‌గా ఎలాంటి డాక్యుమెంట్లు అందించొద్దని అన్ని శాఖలకు సూచించింది. ఏవైనా కేసుల్లో దర్యాప్తు సంస్థల ఎంక్వైరీలకు ఎవరూ ప్రత్యక్షంగా స్పందించకూడదని, వాటిని ప్రాసెసింగ్ కోసం క్యాబినెట్ సెక్రటేరియట్ అండ్ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలని ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ మేరకు సీఎం సోరేన్ ప్రధాన కార్యదర్శి వందన దడేల్ మంగళవారం అన్ని ప్రభుత్వ విభాగాలకు లేఖ రాశారు. అసంపూర్తి, తప్పు సమాచారం అందించడాన్ని నివారించేందుకు, కేంద్ర దర్యాప్తు సంస్థలతో సరైన సహకారం ఉండేలా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొన్నారు.

దర్యాప్తు సంస్థలకు సహాయ నిరాకరణ!

చాలా సందర్భాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు నోటీసులను సీనియర్ అధికారుల దృష్టికి తీసుకురాకుండా రాష్ట్ర ప్రభుత్వ డాక్యుమెంట్లను కేంద్ర ఏజెన్సీలకు అందించడం జరిగిందని, ఇది తప్పుడు ప్రక్రియ అని వందన తెలిపారు. కొత్త ప్రక్రియ ప్రకారం.. కేంద్ర దర్యాప్తు సంస్థలకు తగిన సమాచారం అందించడంలో క్యాబినెట్ సెక్రటేరియట్ అండ్ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థల నుంచి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు నోటీసులు వస్తే.. డిపార్ట్‌మెంట్ హెడ్ ఆ సమాచారాన్ని నోడల్ ఏజెన్సీకి పంపిస్తారు. చివరిగా న్యాయపరమైన సలహాలు తీసుకొని, అందుకు అనుగుణంగా కేంద్ర దర్యాప్తు సంస్థలకు అడిగిన సమాచారాన్ని అందించడం జరుగుతుంది. దర్యాప్తు సంస్థలకు అసంపూర్తి సమాచారాన్ని అందజేయకుండా ప్రక్రియను క్రమబద్ధీకరిస్తున్నట్టు జార్ఖండ్ ప్రభుత్వం చెబుతుండగా.. అయితే ఇది సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలకు సహాయ నిరాకరణలో భాగమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఈడీ ఇప్పటికి సోరేన్‌కు ఏడుసార్లు సమన్లు జారీచేసింది.

దేశమంతా జన జాగరణ్

- **కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్కేఎం కదనభేరి**
- **ఇంటింటికీ తిరిగి.. మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా ప్రచారం**

న్యూఢిల్లీ, జనవరి 10: మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా రైతు సంఘాల ఐక్య వేదిక ‘సంయుక్త కిసాన్ మోర్చా’ (ఎస్కేఎం) సమరభేరి మోగించింది. లోక్‌సభ–2024 ఎన్నికల్లో మోదీ సర్కార్ ఓటమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ‘జన జాగరణ్’ ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నట్టు ఎస్కేఎం ప్రకటించింది. జనవరి 10 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి రైతాంగ సంక్షోభం, మోదీ సర్కార్ కార్పొరేట్ అనుకూల విధానాలపై అవగాహన కల్పిస్తామని మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలోని 30.4 కోట్ల కుటుంబాల్లో కనీసం 40 శాతం కుటుంబాలను ప్రత్యక్షంగా కలుసుకోవాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నది. దేశంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాల్ని వివరిస్తూ ప్రచార సమాచారాన్ని అన్ని భాషల్లో రూపొందించామని, దేశంలో నేడు రైతులు, వ్యవసాయ కూలీలు, యువత ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరిస్తామని ఎస్కేఎం తెలిపింది. రైతులు, రైతు కూలీల ఆలిండియా సదస్సు(2023) తీర్మానంలోని డిమాండ్లకు మద్దతు సేకరించటం ప్రచార ఉద్యమం లక్ష్యమని ఎస్కేఎం నాయకులు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో కరపత్రాలు, నోటీసులు అతికిస్తామని, మోదీ సర్కార్ కార్పొరేట్ అనుకూల విధానంలో లోపాల్ని బహిర్గతం చేస్తామని వివరించారు. ఇదిలా ఉండగా, జన జాగరణ్ ఉద్యమానికి కేంద్ర కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. జిల్లా కేంద్రాల్లో జనవరి 26న తలపెట్టిన ట్రాక్టర్ పరేడ్ ర్యాలీలో రైతులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎస్కేఎం ఈ సందర్భంగా కోరింది.

యాంటీ ర్యాగింగ్ @ 1800-180-1522

- **24 గంటల పాటు హెల్ప్‌లైన్**
- **ర్యాగింగ్‌ను నిరోధించేందుకు పటిష్ఠ నిబంధనలు**
- **విద్యాసంస్థల్లో ఆత్మహత్య ఘటనలపై ప్రిన్సిపాళ్లు, రిజిస్ట్రార్లు విచారణకు రావాల్సిందే**
- **యూజీసీ కీలక ఆదేశాలు జారీ**

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : విద్యాసంస్థల్లో ర్యాగింగ్ భూతం బారిన పడ్డారా..? కాలేజీకి వెళ్లాలంటేనే భయమేస్తున్నదా? అయితే ర్యాగింగ్ రక్కసి బాధిత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జాతీయ స్థాయిలో 1800–180–1522 హెల్ప్‌లైన్ అందుబాటులో ఉన్నది. ఇది 24 గంటల పాటు 365 రోజులు సేవలందిస్తుంది. helpline@antiragging ఈ–మెయిల్‌కు ఫిర్యాదు చేయొచ్చు. యూజీసీ మానిటరింగ్ సెల్ నంబర్ 0882645580ను కూడా బాధిత విద్యార్థులు సంప్రదించవచ్చు. 2009 సుప్రీంకోర్టు తీర్పు, యూజీసీ 1956 సెక్షన్ 36, సబ్‌సెక్షన్ (1) ప్రకారం విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధం. అయినా ఆకతాయిలు శృతిమించి ప్రవర్తిస్తున్నారు. మూడు నెలల క్రితం గాంధీ మెడికల్ కాలేజీ, కాకతీయ మెడికల్ కాలేజీ, మహబూబాబాద్ మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలు వెలుగుచూశాయి. అడపాదడపా పలు విద్యాసంస్థల్లో కూడా ర్యాగింగ్ కనపడుతున్నది. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కీలక ఆదేశాలిచ్చింది. ఉన్నత విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లకు, వర్సిటీల వీసీలకు యూజీసీ లేఖలు రాసింది. ర్యాగింగ్‌ను క్రిమినల్ చర్యగా పేర్కొన్న యూజీసీ.. దీనిని నిరోధించడానికి పటిష్ఠ నిబంధనలు రూపొందించినట్టు వెల్లడించింది.

యూజీసీ ఆదేశాలు..

- విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీని, యాంటి ర్యాగింగ్ స్క్వాడ్‌ను, యాంటీ ర్యాగింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలి.
- ర్యాగింగ్ శృతిమించి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొంటే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్, వర్సిటీ రిజిస్ట్రార్లను విచారణకు పిలుస్తారు. వీరు నేషనల్ యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.
- విద్యాసంస్థలు, హాస్టళ్లలో, ప్రముఖ ప్రాంతాల్లో సీసీటీవీలు ఏర్పాటుచేయాలి.
- విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించాలి.
- యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ ఆదేశాల ప్రకారం జూనియర్లు, సీనియర్ల మధ్య తారతమ్యాన్ని పూడ్చేందుకు మెంటార్‌షిప్‌ను ప్రోత్సహించాలి.
- లీగల్ కౌన్సెలింగ్ ఇచ్చి ర్యాగింగ్ నిరోధక చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించాలి.